# ప్రచార హోరు

- కార్యకర్తల సమావేశాల్లో పాల్గొన్న అభ్యర్థులు
- జోగు రామన్న, అనిల్ జాదవ్‌కు ప్రజల బ్రహ్మరథం
- భారీ మోటార్ సైకిల్ ర్యాలీలు
- పార్టీ పథకాలు, మ్యానిఫెస్టోపై ప్రచారం

## ఆదిలాబాద్, బోథ్ నియోజకవర్గాల్లో దూసుకెళ్తున్న బీఆర్ఎస్


భోరజ్‌లో మాట్లాడుతున్న ఎమ్మెల్యే జోగు రామన్న


హాజరైన బీఆర్ఎస్ నాయకులు

ఆదిలాబాద్, అక్టోబరు 17 ( నమస్తే తెలంగాణ): ఆదిలాబాద్ జిల్లాలో బీఆర్ఎస్ అభ్యర్థులు ఎన్నికల ప్రచారంలో దూసుకెళ్తున్నారు. ఆదిలాబాద్, బోథ్ నియోజకవర్గాల్లో నాయకులు, కార్యకర్తలు ఇప్పటికే ప్రచారం కొనసాగిస్తున్నారు. పార్టీ అధినేత కేసీఆర్ చేతుల మీదుగా బీ-ఫామ్స్ అందుకున్న అభ్యర్థులు, ఇక క్షేత్రస్థాయిలో ప్రచారాన్ని మరింత ముమ్మరం చేశారు. విజయమే లక్ష్యంగా పకడ్బందీ ప్రణాళికతో ముందుకు సాగుతున్నారు. మంగళవారం రెండు నియోజకవర్గాల్లో బీఆర్ఎస్ శ్రేణులు భారీ మోటార్ సైకిల్ ర్యాలీలు నిర్వహించాయి. ఆదిలాబాద్ నియోజకవర్గంలో ఆదిలాబాద్ రూరల్ మండలం జందాపూర్ ఎక్స్‌రోడ్ నుంచి భోరజ్ మండలం వరకు నాలుగు కిలోమీటర్ల మేర వందలాది మోటార్ సైకిళ్లతో నిర్వహించిన ర్యాలీలో వేలాది మంది కార్యకర్తలు పాల్గొన్నారు. ఆదిలాబాద్ ఎమ్మెల్యే జోగు రామన్న, డీసీసీబీ చైర్మన్ అడ్డి భోజారెడ్డి మోటార్‌సైకిల్ నడపి కార్యకర్తలను ఉత్సాహపర్చారు. బోథ్ నియోజకవర్గంలో బోథ్ మండలం పొచ్చర ఎక్స్‌రోడ్ నుంచి బోథ్ మండలం కేంద్రం వరకు చేపట్టిన భారీ ర్యాలీకి వేలాది మంది కార్యకర్తలు హాజరయ్యారు. నియోజకవర్గ ఇన్‌చార్జి, మాజీ ఎంపీ జీ నగేశ్, అభ్యర్థి అనిల్‌జాదవ్, ఎంపీటీసీల ఫోరం జిల్లా అధ్యక్షుడు తుల శ్రీనివాస్ ఈ ర్యాలీలో పాల్గొన్నారు. పార్టీ జెండాలు, ఆటాపాటలతో ర్యాలీలు పండుగ వాతావరణాన్ని తలపించాయి. అయితే ఎన్నికలకు నెలన్నర గడువే ఉండడంతో బీఆర్ఎస్ రెండు నియోజకవర్గాల్లో దూకుడగా ముందుకెళ్తున్నది. మరోవైపు కాంగ్రెస్, బీజేపీ అభ్యర్థులను ప్రకటించకపోవడంతో ఆయా పార్టీల శ్రేణుల్లో నిర్లిప్తత కనిపిస్తున్నది. అయితే ఈ రెండు నియోజకవర్గాల్లో ఆపార్టీల్లో వర్గ విభేదాలు తీవ్రంగా ఉన్నాయి.

### అభివృద్ధి, సంక్షేమ పథకాలపైనే..

త్వరలో జరిగే అసెంబ్లీ ఎన్నికల్లో అభ్యర్థుల విజయంలో బీఆర్ఎస్ కార్యకర్తల పాత్ర కీలకమని, పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో చేసిన అభివృద్ధి, సంక్షేమ పథకాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకుపోవాలని ఆదిలాబాద్ ఎమ్మెల్యే జోగు రామన్న, బోథ్ నియోజకవర్గ ఇన్‌చార్జి జీ నగేశ్, అభ్యర్థి అనిల్‌జాదవ్ సూచించారు. ఆదిలాబాద్ నియోజకవర్గం భోరజ్, బోథ్‌లో జరిగిన కార్యకర్తల సమావేశంలో వారు మాట్లాడారు. బీఆర్ఎస్ మ్యానిఫెస్టోను విస్తృతంగా ప్రచారం చేయాలని పిలుపునిచ్చారు. కార్యకర్తలు పట్టణాల్లో, గ్రామాల్లో ఇంటింటికీ పోయి ప్రచారం నిర్వహించాలని సూచించారు. 60 ఏండ్లు అధికారంలో ఉన్న కాంగ్రెస్ పార్టీ ప్రజలకు చేసిందేమీ లేదని ఆదిలాబాద్ ఎమ్మెల్యే జోగు రామన్న గుర్తు చేశారు.

### జైనథ్‌లో..

జైనథ్, అక్టోబర్ 17: రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి పథకాలను గడపగడపకూ వివరించాలని ఎమ్మెల్యే జోగు రామన్న అన్నారు. జైనథ్ మండలం భోరజ్‌లో మంగవారం ఆత్మీయ సమ్మేళనాన్ని నిర్వహించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రతి కార్యకర్త అంకుఠిత దీక్షతో పార్టీ గెలుపునకు కృషి చేయాలని సూచించారు. సీఎం కేసీఆర్ మహిళలకు పెద్ద పీట వేశారని పేర్కొన్నారు. పార్టీ అమలు చేసిన పథకాలు, ప్రస్తుత మ్యానిఫెస్టోను వివరించారు. మూడోసారి ముచ్చటగా సీఎం కేసీఆర్‌ను, ఐదోసారి ఎమ్మెల్యేగా తనను భారీ మెజార్టీతో గెలిపించాలని పిలుపునిచ్చారు. డీసీసీబీ చైర్మన్ అడ్డి భోజారెడ్డి, గ్రంథాలయ చైర్మన్ మనోహర్, రైతుబంధు సమితి జిల్లా అధ్యక్షుడు రమేశ్, ఎంపీపీ మార్సెట్టి గోవర్ధన్, వైస్ చైర్మన్ విజయ్‌కుమార్, బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు వెంకట్ రెడ్డి, రైతుబంధు మండల కన్వీనర్ లింగారెడ్డి, సర్పంచ్‌ల సంఘం మండలాధ్యక్షుడు ఊశన్న, ఏఎంసీ వైస్ చైర్మన్ వేణు గోపాల్ యాదవ్, ఏఎంసీ మాజీ చైర్మన్ నర్సింగ్ రావ్, మండల మాజీ ఉపాధ్యక్షుడు కల్చాప్ రెడ్డి, బీఆర్ఎస్ పార్టీ ప్రధాన కార్యదర్శి గణేశ్ యాదవ్, పీఏసీఎస్ చైర్మన్ పురుషోత్తం యాదవ్, నాయకులు పాల్గొన్నారు.


చంద్రఘంట రూపంలో అమ్మవారు

## చంద్రఘంట రూపంలో అమ్మవారు

### బాసరలో దర్శనానికి తరలివచ్చిన భక్తజనం

బాసర, అక్టోబర్ 17: బాసర సరస్వతీ ఆలయంలో నవరాత్రోత్సవాలు కనుల పండువగా కొనసాగుతున్నాయి. మూడో రోజు మంగళవారం సరస్వతీ అమ్మవారు చంద్రఘంట రూపంలో భక్తులకు దర్శనమిచ్చారు. అమ్మవారికి కొబ్బరి, అన్నం నైవేద్యంగా సమర్పించారు. మంగళహారతి, మంత్ర పుష్పం, పుణ్యాహావచనము, తదితర పూజలు నిర్వహించారు. అమ్మవారిని దర్శించుకొని భక్తులు తమ చిన్నారులకు అక్షర శ్రీకార పూజలు జరిపించారు. కాగా, బుధవారం కుష్మాండ రూపంలో అమ్మవారు దర్శనమివ్వనున్నారు.

## పథకాలను ఇంటింటికీ వివరించాలి

- నియోజకవర్గ ఇన్‌చార్జి జీ నగేష్
- బోథ్‌లో కార్యకర్తల సమావేశం

బోథ్, అక్టోబర్ 17: బీఆర్ఎస్ పథకాలపై ఇంటింటికీ ప్రచారం చేయాలని ఆదిలాబాద్ మాజీ ఎంపీ, బోథ్ నియోజకవర్గ పార్టీ ఇన్‌చార్జి జీ నగేశ్ పిలుపునిచ్చారు. బోథ్‌లోని పరిచయ గార్డెన్‌లో మంగళవారం కార్యకర్తల సమావేశం ఏర్పాటు చేశారు. అంతకుముందు పొచ్చెర క్రాస్‌రోడ్డు నుంచి బోథ్ వరకు భారీ మోటార్ సైకిల్ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో నగేశ్ మాట్లాడుతూ... అధినేత కేసీఆర్ ఆదేశాల మేరకు అందరూ కలిసికట్టుగా పనిచేసి, పార్టీ అభ్యర్థి గెలుపు కోసం కృషి చేయాలని సూచించారు. సంక్షేమ పథకాలు ఇంటింటికీ చేరాయని, ప్రతిపక్షాల అసత్య ప్రచారాన్ని తిప్పికొట్టాలని పిలుపునిచ్చారు. బూత్ కమిటీల్లో ప్రతి వంద మందికి ఒకరిని నియమించుకుని గ్రామ కమిటీలు, సర్పంచులు, ఎంపీటీసీలు, ఇతర ప్రజా ప్రతినిధులు బాధ్యతగా తీసుకొని ప్రచారం చేయాలన్నారు. బోథ్ నియోజకవర్గ బీఆర్ఎస్ అభ్యర్థి అనిల్ జాదవ్ మా ట్లాడుతూ..సీఎం కేసీఆర్ ప్రకటించిన మ్యానిఫెస్టో వివరాలు ఇంటింటికీ ప్రచా రం చేయాలన్నారు. తెల్లరేషన్ కార్డుదారులకు సన్న బియ్యం, రూ. 400కే సిలిండ ర్లు, అర్హులైన మహిళలకు నెలకు రూ 3 వే ల చొప్పున ఏడాదికి రూ. 36 వేలు అందిస్తారని వివరించాలన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వం గతంలో ఏం చేసింది, మళ్లీ అధికారంలోకి వస్తే ఏం చేస్తుందో చెప్పాలని కోరారు. మరో 40 రోజుల గడువు మాత్ర మే మిగిలి ఉందని, ప్రతి కార్యకర్త గెలుపు కోసం కృషి చేయాలని కోరారు. సమావేశంలో బోథ్ ఎంపీపీ తుల శ్రీనివాస్, జడ్పీటీసీ సంధ్యారాణి, పార్టీ మండల కన్వీనర్ నారాయణరెడ్డి, ఏఎంసీ చైర్మన్ రుక్మణ్‌సింగ్, సర్పంచులు సురేందర్‌యాదవ్, శ్రీధర్‌రెడ్డి, సొసైటీ చైర్మన్ ప్రశాంత్, జడ్పీటీసీలు తాటిపెల్లి రాజు, సుధాకర్ పాల్గొన్నారు. కాగా అంతకుముందు పొచ్చెర క్రాస్‌రోడ్డు నుంచి బోథ్ వరకు భారీ బైక్ ర్యాలీ నిర్వహించారు.


సమావేశంలో మాట్లాడుతున్న బోథ్ బీఆర్ఎస్ అభ్యర్థి అనిల్ జాదవ్

## సెల్ఫీ విత్ కార్.. ఓట్ ఫర్ ఐకేఆర్

- నిర్మల్‌లో వినూత్న ప్రచారం
- ప్రారంభించిన యువ నాయకురాలు అల్లోల దివ్యాగౌతం రెడ్డి

నిర్మల్ అర్బన్, అక్టోబర్ 17: రానున్న అసెంబ్లీ ఎన్నికల్లో నిర్మల్ నియోజక వర్గ బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థి అల్లోల ఇంద్రకరణ్ రెడ్డిని కారు గుర్తుకు ఓటేసి భారీ మెజార్టీతో గెలిపించాలని కోరుతూ 'సెల్ఫీ విత్ కార్..ఓట్ ఫర్ ఐకేఆర్' అంటూ వినూత్న ప్రచారానికి మంగళవారం శ్రీకారం చుట్టారు. పార్టీ గుర్తును ప్రజల్లోకి బలంగా తీసుకెళ్తూ ప్రచారం కోసం వచ్చే వాహనం ముందు కార్యకర్తలు, నాయకులు, యువత, ప్రజలు సెల్ఫీ తీసుకొని సామాజిక మాధ్యమాల్లో విస్తృతంగా ప్రచారం చేయాలని పిలుపునిచ్చారు. రాష్ట్రంలో మరోసారి గులాబీ జెండా ఎగురవేయాలని సూచించారు. అనంతరం కారుతో సెల్ఫీ తీసుకొని సోషల్ మీడియాలో పోస్ట్ చేసి ప్రచారాన్ని ప్రారంభించారు.


కారుతో సెల్ఫీ తీసుకుంటున్న అల్లోల దివ్యాగౌతంరెడ్డి

## ఆదరించండి.. అభివృద్ధి చేస్తా

- ముథోల్ ఎమ్మెల్యే విఠల్ రెడ్డి
- పుస్పూర్‌లో బీఆర్ఎస్ ప్రచారం
- పార్టీలో చేరిన బీజేపీ, కాంగ్రెస్ నాయకులు


మాట్లాడుతున్న ముథోల్ ఎమ్మెల్యే విఠల్ రెడ్డి

లోకేశ్వరం, అక్టోబర్, 17: బీఆర్ఎస్‌ను ఆదరించి మరోసారి కేసీఆర్ నాయకత్వాన్ని బలపరిస్తే నియోజకవర్గాన్ని మరింత అభివృద్ధి చేస్తానని ఎమ్మెల్యే విఠల్ రెడ్డి అన్నారు. మండలంలోని పుస్పూర్ గ్రామంలో ఎన్నికల ప్రచారాన్ని మంగళవారం ఆయన ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ నర్సయ్యతో పాటు ఆయా కుల సంఘాల, పార్టీల నాయకులు బీఆర్ఎస్ కండువా కప్పుకున్నారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ 59 ఏండ్లలోపు వారు మరణిస్తే ఆ కుటుంబానికి రూ. 5 లక్షల బీమాను అందించేందుకు కేసీఆర్ ప్రకటించినట్లు తెలిపారు. మహిళలకు సౌభాగ్యలక్ష్మి పథకం ద్వారా రూ. 3 వేల పింఛన్ ఇవ్వబోతున్నట్లు తెలిపారు. పింఛన్లు కూడా పెరుగుతాయని చెప్పారు. ఈ సందర్భంగా పార్టీ మ్యానిఫెస్టోలో పెట్టిన వాటిని వివరించారు. ప్రతిపక్ష పార్టీల నాయకులు లేనిపోని హామీలు ఇచ్చి ప్రజలను మభ్యపెడుతున్నారని విమర్శించారు. నవంబర్ 3 న కేసీఆర్ భైంసా పట్టణంలో భారీ బహిరంగ సభలో పాల్గొంటారని తెలిపారు. జడ్పీ మాజీ చైర్మన్ లోలం శ్యాంసుందర్, ఎంపీపీ లలితా భోజన్న, పార్టీ మండల కన్వీనర్ శ్యాంసుందర్, పీఏసీఎస్ చైర్మన్ రత్నాకర్ రావు, భైంసా ఏఎంసీ వైస్ చైర్మన్ జేకే పటేల్, నాయకులు గంగయ్య, దత్తు పటేల్, బండి ప్రశాంత్, కపిల్ దిగంబర్, ఆయా గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, తదితరులు పాల్గొన్నారు.

### లోకేశ్వరంలో పార్టీ కార్యాలయం ప్రారంభం

లోకేశ్వరంలో బీఆర్ఎస్ మండల పార్టీ కార్యాలయాన్ని మంగళవారం ఎమ్మెల్యే విఠల్ రెడ్డి ప్రారంభించారు. నగర్, పిప్రి, లోకేశ్వరం గ్రామాల నుంచి పెద్ద ఎత్తున పార్టీలో చేరారు. ఎమ్మెల్యే విఠల్ రెడ్డి మాట్లాడుతూ ప్రతి ఒక్కరికీ సముచిత స్థానం కల్పిస్తామని పేర్కొన్నారు. పార్టీ గెలుపునకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని కోరారు.